
# ఉద్యమకారుడికి కన్నీటి వీడ్కోలు

జనగామ, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ)/ స్టేషన్‌ఘన్‌పూర్/చిల్పూరు : చిల్పూరు మండలం రాజవరం గ్రామం కన్నీటి సంద్రమైంది. తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ జనగామ జిల్లా అధ్యక్షుడు, జడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి అంత్యక్రియలు వేలాది మంది అశ్రునయనాల నడుమ మంగళవారం ముగిశాయి. అంతిమయాత్రలో బీఆర్ఎస్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని పాగాల పార్థివదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులను ఓదార్చారు.



పాగాల సంపత్‌రెడ్డి కుమార్తెను ఓదార్చుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పక్కన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి

పాగాల సంపత్‌రెడ్డి పార్థివదేహం



- అశ్రునయనాల మధ్య పాగాల సంపత్‌రెడ్డి అంత్యక్రియలు
- నివాళులర్పించిన బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కుటుంబ సభ్యులకు ఓదార్పు
- బీఆర్ఎస్ పక్షాన అండగా ఉంటామని భరోసా
- అన్నీ తామై చూసిన ఎమ్మెల్యేలు పల్లా, కడియం
- హాజరైన మాజీ మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి, మాజీ ఎమ్మెల్యేలు రాజయ్య, ముత్తిరెడ్డి, ఎంపీ దయాకర్
- కడసారి చూసేందుకు భారీగా తరలివచ్చిన ప్రజలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న తండ్రి జయపాల్‌రెడ్డి

అనంతరం విలేకరులతో కేటీఆర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైన పాగాల సంపత్‌రెడ్డి హఠాన్మరణం బాధాకరమన్నారు. 14ఏండ్లు కేసీఆర్ వెంట ఓ సైనికుడిలా ఉండి పని చేశారని, ఆయన మరణం ప్రతి బీఆర్ఎస్ కార్యకర్తను కలచి వేసిందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా సంపత్‌రెడ్డి క్రియాశీలకంగా పని చేశారని, పార్టీ ఏ కార్యక్రమం ఇచ్చినా నిబద్ధతతో పనిచేస్తూ విజయవంతం చేశారని గుర్తుచేశారు. సంపత్‌రెడ్డి కుటుంబానికి కేసీఆర్, పార్టీ శ్రేణుల తరపున ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలుస్తామన్నారు. నేడు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల జడ్పీ అధ్యక్షులు, పార్టీ జిల్లా అధ్యక్షులు, శ్రేణులు పార్టీ కార్యాలయాల్లో పాగాలకు ఘనంగా నివాళులర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఎన్నికల ప్రచారంలోనూ జనగామ జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో విస్తృతంగా ప్రచారం చేసిన పాగాల హఠాన్మరణం తనను తీవ్రంగా కలిచివేసిందన్నారు. ఇంత చిన్న వయస్సులో దూరం కావడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఆయన కుమార్తె చదువు బాధ్యత సహా ఆర్థికంగా పార్టీ తరపున చూసుకుంటామని భరోసానిచ్చారు.



సంపత్‌రెడ్డి పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ పోచంపల్లి, బీఆర్ఎస్ శ్రేణులు

## పాగాల మృతి బాధాకరం

ఉద్యమంలో సంపత్‌రెడ్డి చురుకైన పాత్ర పోషించారు. నిబద్ధత గల నాయకుడిగా సేవలందించారు. ఆయన అకాల మరణం నన్ను తీవ్ర ఆవేదనకు గురిచేసింది. ఆయన ఇక లేరనే విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నాను. బీఆర్ఎస్ కుటుంబానికి, జనగామ జిల్లాకు ఆయన మరణం తీరని లోటు. వారి కుటుంబ సభ్యులకు ఆత్మస్థైర్యం కలిగించాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నా..

-పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే

## దురదృష్టకరం

మలిదశ ఉద్యమంలో ముఖ్య భూమిక పోషించిన పాగాల సంపత్‌రెడ్డి తనకు అప్పగించిన బాధ్యతలను విజయవంతంగా పూర్తిచేశారు. అభివృద్ధి ఫలాలను జిల్లా ప్రజలకు అందించారు. రెండు దశాబ్దాలకు పైగా గులాబీపార్టీతో ఆయనకు అనుబంధం ఉన్నది. ఆయన మరణం జిల్లాకు, బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు.

-కడియం శ్రీహరి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే



అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాజయ్య

### దగ్గరుండి అంత్యక్రియలు జరిపించిన పల్లా, కడియం..

పాగాల సంపత్‌రెడ్డి సోమవారం సాయంత్రం గుండెపోటుతో తుదిశ్వాస విడువగా, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి హుటాహుటిన రాజవరం చేరుకొని అంత్యక్రియలు పూర్తయ్యే వరకు అన్ని ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు సంపత్‌రెడ్డి అంత్యక్రియల్లో ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూసుకుంటూ కుటుంబ సభ్యుల వెన్నంటి ఉండి వారికి ధైర్యాన్నిచ్చారు. సంపత్‌రెడ్డి పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బండా ప్రకాశ్, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, డాక్టర్ టి.రాజయ్య, గండ్ర వెంకటరమణారెడ్డి, మార్నేని రవీందర్‌రావు, ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్మన్లు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. రాజవరంలోని ఇంటి నుంచి తమ వ్యవసాయ క్షేత్రం వరకు సాగిన అంతిమయాత్రలో పల్లా, కడియం సహా ఉమ్మడి జిల్లాలోని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు, స్నేహితులు అధిక సంఖ్యలో పాల్గొని సహచరుడికి తుది వీడ్కోలు పలికారు.



గార్ల : వానకు తడిసిన వరి మెదలు



చిల్పూర్ మండలం రాజవరంలో వడ్లపై పరదాలు కప్పిన రైతులు

# రైతన్నకు వాన గుబులు

- నేలవాలిన వరి, మిర్చి పంటలు
- పత్తి పంటపైనా తీవ్ర ప్రభావం
- కల్లాల్లో తడుస్తున్న ధాన్యం కుప్పలు
- పంటలను కాపాడుకునేందుకు పాట్లు
- ఒక్కసారిగా చల్లబడిన వాతావరణం

## తుఫాన్ ప్రభావంతో ఒకటే ముసురు.. కోతల వేళ అన్నదాతల ఆందోళన




ఆత్మకూరు : హౌసుబుజుర్గులో నేలవాలిన వరి

మిగ్‌జాం తుఫాన్ ప్రభావంతో అంతటా ముసురందుకుంది. సోమవారం అర్ధరాత్రి నుంచి చిరుజల్లులతో మొదలై మోస్తరు వాన కురుస్తుండడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వరి, మిర్చి, పత్తి పంటలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మంగళ వారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కురిసింది. చిరుజల్లులతో వాతావరణం చల్లాగా మారడంతో ప్రజలెవరూ బయటకు రావడం లేదు. దీంతో పలు గ్రామాల్లో రైతులు కోసిన వరి మెదలు తడిసిపోయాయి. వర్షానికి వడ్ల గింజలు రాలిపోయే ప్రమాదం కూడా ఉందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ముఖ్యంగా కోతల వేళ వరి నేలవాలి కంకులు తడువడం, కల్లాల్లో, మార్కెట్‌లో ఆరబోసిన ధాన్యం కుప్పలు తడిసి మద్దవడం అన్నదాతకు ఆందోళన కలిగిస్తున్నది. చేతికొచ్చిన పంటను కాపాడుకునేందుకు పరదాలు, టార్పాలిన్లు షీట్లు కప్పుతూ జాగ్రత్త పడుతున్నాడు. గాలివానకు పలుచోట్ల మిర్చి మొక్కలు నేలవాలాయి. అలాగే పత్తి ఏరే సమయంలో వాన పడుతుండడంతో రంగు మారి నల్లబడుతుందని చెబుతున్నారు. వర్షంతో పొలాలు తడవడంతో వరికోత యంత్రాలు దిగబడే అవకాశం ఉండడంతో పనులకు అంతరాయం ఏర్పడింది. ఇలా అకాల వర్షం పంటలకు నష్టం కలిగిస్తూ రైతన్నను ఆగం చేస్తోంది.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, డిసెంబర్ 5



శాయంపేట : సూరంపేటలో నేలవాలిన వరి



కాటారం : శంకరంపల్లిలో..



నర్సింహులపేటలో మిర్చి చేనులో నిలిచిన వాన నీరు



ఖానాపురం : ఆరబోసుకున్న ధాన్యంపై పరదాలు కప్పిన రైతులు



ములుగులో కురుస్తున్న వర్షం



గార్ల : వర్షం కారణంగా పొలంలోనే ఖాళీగా ఉన్న వరికోత మిషన్లు



నర్సింహులపేట: కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడవకుండా పరదాలు కప్పుతున్న రైతులు